# వలపు వేట

"మా బాస్ ఇంట్లో పార్టీ ఉంది... అందరూ వస్తున్నారు" కాఫీ తాగుతూ చెప్పాడు సుధాకర్.

"మీరూ వెళ్ళాలన్న మాట!" శ్వేత అంది నిర్లిప్తంగా.

"ఆ వెళ్ళాలి...ఒంటరిగా కాదు..."" చెప్పాడు.

ఉలిక్కిపడింది శ్వేత...అతని కళ్ళలోకి చూసింది. "అందరూ ఫ్యామిలీసుతో వస్తున్నారు...మనంకూడా..."

శ్వేత వదనంలో చిన్న మెరుపు మెరిసి మాయమైంది. "కాని మనకెలా కుదురుతుంది... ఇద్దరు పిల్లలు...నే ఉంటాను... మీరు తొందరగా వచ్చేయండి..."

"ఫర్వాలేదు... వాళ్ళని కూడా తీసుకు వెళదాం".

శ్వేత మాట్లాడలేదు. మౌనంగావుంది. ఈమధ్యకాలంలో ఇద్దరూ పార్టీలకు వెళ్ళలేదు... పిల్లల్ని పరాయి ఇళ్ళకు తీసుకుపోవడంలేదు.

బాబు ఉదయ్‌కు నాలుగేళ్ళు. తెగ అల్లరి చేస్తాడు. పాప సంధ్య కొత్త ప్రదేశంలో ఓ పట్టాన చంక దిగదు. అంతే కాదు అందరూ ఖరీదైన బట్టలేసుకొస్తే... తాను తన భర్త చాలా సింపుల్‌గా వెళతారు.

సహృదయంతో సింప్లీసిటీ వీరికిష్టం అని మెచ్చుకుంటారు. గడుసువారైతే డబ్బు ఆదా చేస్తున్నారని దెప్పి పొడుస్తారు. ఆడంబరులైతే వీరి బీదతనానికి నవ్వుకుంటారు.

"మంచి డ్రస్సు లేదు...." శ్వేత అంది స్వగతంగా " ఏం పర్వాలేదు... పిలిచింది మా బాస్ !కొంచెం తక్కువ రకం వేసుకెళితేనే అన్ని రకాలుగా బాగుంటుంది." చెప్పాడు.

శ్వేత పిల్లల్ని తయారు చేసి తను తయారయ్యే సరికి కొంచెం ఆలస్యం అయింది. జల్లుకూడ పడసాగింది.

కన్వేయన్సు కొంచెం ఇబ్బంది. అదె తక్కువని ఔట్ స్కర్ట్సులో కాపురం చేస్తున్నారు. తనొక్కడే అయితే సైకిలుమీద పోగలడు- దగ్గర దాపు అయితే నడవచ్చు. కాని దూరం.

"ఆటో తీసుకు వస్తారా?" మొహం చిట్లించి అడిగింది. ఇంత కష్టపడి మేకప్ చేసుకుంది వర్షంలో తడవడానికి కాదుగా.

"నాలుగడుగులు వేస్తే రోడ్డుమీద చేరుకోవచ్చు" అయిష్టంగా అన్నాడు సుధాకర్.

"కాని వాన...పిల్లలకు రోగాలొస్తే కష్టం!"

"అబ్బా ఆటో లోపలికొస్తే వాడిష్టం వచ్చినట్టు అడుగుతాడు...అయిదు రూపాయలు ఊరికేవేస్టు." చెప్పాడు.

శ్వేత మనసు చివుక్కుమంది.

ఐదు రూపాయలు ముఖ్యమా...

తను...పిల్లలు తడవకుండా గమ్యం చేరడం ముఖ్యమా!

"సరే-ఏం చేస్తాను...తెస్తాలే...పొరపాటు నాదే... మిమ్మల్ని బయలుదేరదీయడం" విసుక్కుంటూ సైకిలుమీద వెళ్ళాడు.

"ఈ మధ్య ఈయనకి విసుగు ఎక్కువైంది!" స్వగతంగా అనుకుంది.

పెళ్ళయిన కొత్తల్లో పల్లెత్తు మాట అనేవాడు కాదు. కాలుకింద పెడితే కందిపోతుందేమో నన్నంత అపురూపంగా చూసుకునేవాడు! ఏవమ్మా ఆ ప్రేమలు? ఎక్కడ దాక్కున్నాయి?

"ఆటో...ఆటో...!" అంటూ పిల్లలు ఆటోలో కూర్చున్నారు. అవును మరి. ఈ మధ్య ఆటోలో ఎక్కలా వాళ్ళు. ఛ! అనుకుంది.

"పదిహేను రూపాయలు" చెప్పాడు సుధాకర్.

"కాన్వేండి...బ్రతకడమే పెద్ద ఖర్చు!" విసుక్కుంటూ కూర్చుంది.

ఆటో రయ్‌మని బయలుదేరింది.

పెద్ద ప్రాక్టికల్ జోక్ ఏమిటంటే రోడ్డుమీద అక్కడక్కడ స్పీడ్ బ్రేకర్లని వెహికల్ బ్రేకర్లు కనిపిస్తూ ఉంటాయి. ఈమధ్య కాలంలో ఏ రోడ్డు...పేరుకు తగ్గట్టు లేదు.

ట్యాప్ వాటర్ రిపేర్లు కోసం ... తవ్వారో లేదో...టెలిఫోన్ కోసం...కేబుళ్ళ కోసం తవ్వాల్సి వస్తుంది. అడపా దడపా వచ్చే రాజకీయ నాయకుల స్వాగతాలకు ఎలాగు గతుకులు తప్పవు.

శ్వేత ఆలోచనల్లోంచి తేరుకునేసరికి ఆటో ఓ పెద్ద బంగళా ముందు ఆగింది.

అప్పటికే ఆవరణలో కార్లు...స్కూటర్లు వగైరాలు దర్శనమిచ్చాయి.

"హలో...సుధాకర్! ఇంత లేటేంటి?" నిష్టూరంగా అడిగాడు బాస్ శ్రీపతి.

"సారి ... మా శ్రీమతి తయార్యయే సరికి...ఇలా అయిపోయింది" ఆవలీగా నెపం శ్వేత మీద నెట్టేశాడు సుధాకర్.

'నమస్తే! శ్వేత మా ఆవిడ...వాడు ఉదయ్! ఇది సంధ్య!"పరిచయం చేశాడు.

"ముచ్చటగా ఉన్నారు" శ్రీపతి మెచ్చుకున్నాడు.

ఆ ఉన్నారు లో తనుకూడా లేదు కదా అని అనుమాన పడింది శ్వేత.

"పార్టీ మిద్దెపైన...అటు మెట్లున్నాయి-పైకి వెళ్ళండి." శ్రీపతి చెప్పాడు.

"సరేసార్..." సుధాకర్ కదిలాడు.

బఫే టేబుల్ దగ్గర వడ్డిస్తున్న చందనను చూసి ఆశ్చర్యపోయింది శ్వేత.

"చందూ నువ్విక్కడ!" ఆనందంతో అరిచింది.

ఆహూతులు ఇటు తల తిప్పి చూశారు. చందన కొంచెం ఇబ్బందిగా చూసింది.

శ్వేత సర్దుకుంది.

"శ్వేత! నువ్వు మీ పిల్లలా?" చందన అడిగింది.

"ఆ! మావారు సుధాకర్!" శ్వేత చూపించింది.

చందన తలాడించింది.

"ప్లేట్ తీసుకోండి...వడ్డిస్తాను..."చెప్పింది.

బఫే కాబట్టి...మీల్స్ ప్లేట్ తీసుకుని నిలబడితే వడ్డించేవాడు ఆ ప్లేట్‌లో ఇంత

పడేస్తాడు.

శ్వేతకు ఈ మధ్య తను చూసిన సినిమాలోని పాట గుర్తుకొచ్చింది... బాబూమోహన్ కదూ... "ఇంత పప్పుంటే వెయ్యమ్మో! ఇంత కూరుంటే వెయ్యామ్మో!" అలా ముష్టివాళ్ల పాట!

దూరంగా నిల్చొని తినసాగారు.

పిల్లలు విజృభించారు. అడిగి అడిగి స్వీట్లు పెట్టించుకున్నారు. చందన వాళ్ళకు స్వీట్లు వడ్డించింది. వడ్డించేటప్పుడు ఒక్క చూపు శ్వేత వేపు చూసింది.

ఆకలేస్తున్నా శ్వేత తినలేక పోయింది మళ్ళీ అడిగి పెట్టించుకోవడం తనకిష్టం లేకపోయింది.

ఏ మహానుభావుడు కనిపెట్టాడో గాని మా ఇంటికి భోజనానికి వచ్చి ఈ పూట ఒక్క పొద్దు ఉండండి అన్నట్లుంటుంది - బఫే మీల్స్.

ఎంతమందో ఏవో విషయాలు చెప్పుకుంటున్నారు. కరచాలనాలు...జోకులు వగైరాలు జరుగుతున్నాయి.

కాని శ్వేత దృష్టి చందన మీద...చందన మెళ్ళో వున్న నగలపైన...ఆమె కట్టిన అతి ఖరిదైన జరీ చీరెపైన ఉంది. "హౌ లక్కీ షి ఈజ్!" ఈర్ష్య గా అనుకుంది.

" ఫ్రెండ్స్! మా ఆహ్వానం మన్నించి మీరంతా వచ్చినందుకు కృతజ్ఞతలు. సంగతి చెప్పకుండా పార్టీకి పిలిచినందుకు బాధపడుతున్నారా? సస్పెన్స్ విప్పేస్తున్నా? ఈ రోజు నా బెటర్ హాఫ్ బర్త్‌డే!" శ్రీపతి ప్రకటించాడు.

"హ్యాపీ బర్త్‌డే టు చందనా మేడమ్!" ఎవరో అన్నారు. అందరూ అందుకున్నారు.

శ్వేత ఆవాక్కు రాలైంది.

వచ్చిన వాళ్ళు తాము తెచ్చిన ప్రెజెంటేషన్లు ఆమెకు అందిస్తున్నారు.

ఉదయ్-సంధ్య అక్కడ పెట్టిన పళ్ళను ఆబగా తింటున్నారు.

"మెనీ హ్యాపి రిటర్న్స్ ఆఫ్ ది డే!" సుధాకర్ తను తెచ్చిన స్టీల్ తాంబులం పళ్ళెం ప్యాకెట్టు అందించాడు.

దాన్ని ఆమె అందీ అందుకున్నట్లు అందుకుని పక్క టేబుల్ మీదకు గిరాటేసింది.

శ్వేతకు మనస్సు చివుక్కుమంది. దీనికెంత పొగరు అనుకుంది.

ఆ రాత్రి శ్వేతకు నిద్ర పట్టలేదు. "ఏవండీ...మీ బాస్ వచ్చి ఎంత కాలమైంది?" అడిగింది.

"ఆ! ఓ రెండు నెల్లు అయి ఉంటుంది. ఏం! వాళ్ళ మిసెస్ నీకు ముందే తెల్సా?" సుధాకర్ అయిష్టంగా అడిగాడు.

"ఆ! చందన నా క్లాస్‌మేట్ డిగ్రీలో!"

"నేనెప్పుడూ చూసినట్లు లేదు." గొణిగాడు.

"చూసినా మర్చిపోయి వుంటారు...ఆయినా గుర్తు పెట్టుకునేంత అందగత్తై కాదులెండి అది!" మూతి విరిచింది.

" నీ అంత కాదులేగాని...బాగానే వుంటుంది."

"ఆ! దానికి మీ బాస్ ఎలా దొరికాడో!"

"నాకేం తెల్సు...రేపు కనుక్కోమంటే కనుక్కుంటాను."

"కాకి ముక్కుకు దొండపండులాగా అతను ఎలా చేసుకున్నాడో దీన్ని కళ్ళు పోయి ఉంటాయి!" శ్వేత అసూయగా అంది.

సుధాకర్ గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు.

శుద్ధ మొద్దవతారం!

"ఆమె నీకు ముందే తెలుసా?" మత్తుగా అడిగాడు శ్రీపతి చందనను.

"ఎవరూ?" చందనకు అర్థం కాలేదు. ఇరవై మంది స్త్రీలు వచ్చారు...ఎవరి గురించో!

"అదేనోయ్...తెల్లగా...నాజుగ్గా...అందంగా వుంటుంది. అప్సరసలాగా!" చెప్పాడు గుర్తు చేసుకుంటూ.

"అదా శ్వేత!"

"కరెక్ట్ - శ్వేత నైస్ గాళ్!"

"ఛ! అదేం నైస్ - వైస్! పెళ్ళికి ముందే కాలు జారింది. కడుపో కాలో అయింది నాకు గుర్తున్నంత వరకు". ఏహ్యాభావంతో చెప్పింది.

శ్రీపతి మత్తు దిగింది.

"ఈజిట్ నువ్వంటున్నది...సుధాకర్ భార్య గురించి?"

"ఆ! ఆ పతివ్రత గురించే! పెళ్ళికి ముందు పిచ్చి తిరుగుళ్ళు తిరిగిందిట! మా ఫ్రెండ్స్ ఒకటే చెప్పుకునేవాళ్ళు!"

మరునాడు సుధాకర్‌ని అడిగాడు శ్రీపతి.

"ఏమోయ్ మీది ఆదర్శ జంట లాగుంది, ప్రేమ వివాహమా?"

సిగ్గుపడ్డాడు సుధాకర్

"పర్వాలేదు-చెప్పు-ప్రేమించి పెళ్ళి చేసుకున్నారా?"

సుధాకర్‌కు గతం గుర్తుకొచ్చింది.

ఓ బంగారు బొమ్మ టైపు నేర్చుకోవడానికి రావడం గమనించాడు-సుధాకర్-సన్నగా-నాజుగ్గా-తీరైన కనుముక్కుతో-చక్కటి పళ్ళు వరుసతో-చిరునవ్వే లిప్‌స్టిక్‌గా-ఠంచనుగా వచ్చే ఆ పాపని చూసి తనూ టైపు నేర్చుకుందమనుకున్నాడు. ఇంకేం వెంటనే చేరిపోయాడు.

ఒకే ఆవరు కావడంవలన ఒకే గదిలో కూర్చుని టైపు నేర్చుకునేవారు.

సుధాకర్ ఆమెతో ఇట్టే స్నేహం పెంచుకున్నాడు. ఆమె చాలా ఫ్రీగా మాట్లాడుతుండేది. తరచు ఇద్దరూ కలిసి నడుస్తూ కనిపించేవారు.

"ఐ లవ్ యూ శ్వేతా!" ఎవరూ లేకుండా చూసి ఓ రోజు చెప్పాడు సుధాకర్.

శ్వేత ఆశ్చర్యపోయింది. అతను ప్రేమించినందుకు కాదు - ఆ మాట అంత ఆలస్యంగా చెప్పినందుకు.

శ్వేత తనవైపువాళ్ళను అడగలేకపోయింది. తనకంటే ముందు ఇద్దరు ఉన్నారు, అక్కలు పెళ్ళికి!. వాళ్ళకి కాకుండా తనకు ఎలాగు చెయ్యరు చెప్పిన దగ్గర్నుండి తనపైన కట్టుబాట్లు ఆంక్షలు మొదలవుతాయి.

సుధాకర్ మింగలేక కక్కలేక బాధపడుతున్నాడు. ఓ రోజు "సుధా! రేపు సాయిబాబా టెంపుల్లోకి వస్తున్నావు."

"ఎప్పుడు?"

"పొద్దున్న తొమ్మిదికి..." చెప్పింది.

"ఎంతో సంతోషంగా ఉన్నావు....ఏంటి విశేషం!"

"రేపు నా బర్త్‌డే!" సిగ్గు పడుతూ చెప్పింది.

"మై గాడ్! ఇప్పుడా చెప్పేది!"

"ఇప్పుడన్నా మీకు కాబట్టి...చెప్పా...ఇంకా ఎవరికీ తెలియదు...ఓ.కే...రేపు కలుద్దాం... బై...." హడావుడిగా వెళ్ళిపోయింది.

సాయినాధుని సన్నిధిలో పూజ చేశారు. దండం పెట్టుకున్నారు. కొబ్బరి తింటూ నదిని చూస్తూ మెట్ల మీద కూర్చున్నారు.

"ఏం కోరుకున్నావు!" అడిగాడు.

"చెప్పను". కళ్ళు మూసుకుంది.

అందమైన శ్వేత ఆ రోజు ఇంకా అందంగా వుంది. ఎర్రటి పట్టు జాకెట్టు-ఎర్రటి జరీ చీరె...తలలో ఎర్రమందారం, చేతి గోళ్ళకు ఎర్రటి పాలిష్...ఎరుపులో అంత అందం ఉందా అని ఆశ్చర్యపోయాడు. ఎరుపులో మెరుపులా ఉంది శ్వేత!

"దేవిగారు ఈ చిన్ని కానుక స్వీకరించాలి" గోముగా అన్నాడు.

"భక్తి ప్రధానం-చిన్నదా, పెద్దదా అన్నది కాదు సమస్య". చెప్పింది నవ్వుతూ శ్వేత.

"ప్రతి సెకెండు నేను గుర్తురావాలని ఓ వాచీ..." జేబులోంచి తీశాడు.

శ్వేత దానివంక చూసింది.

ఖరీదైన క్వార్జ్ వాచీ.

బంగారం రంగులో చెయిన్, డయల్-ఓహ్ ! చాలా బాగుంది.

చనువుగా ఆమె చెయ్యి అందుకుని వాచీ కట్టాడు.

శ్వేత వాచీని ముద్దు పెట్టుకుంది.

"వాచీనైనా కాకపోతిని..." చిన్నగా హమ్ చేశాడు.

"ఛీ పాడు...అంతా చూస్తున్నారు. వెళదాం". సిగ్గుపడింది.

ఆటోలో త్రీ స్టార్ హోటల్ కు చేరుకున్నారు, ఆ టైమ్‌లో అక్కడ రష్ ఉండదు. ఏ.సి క్యాంటిన్‌లో మీల్స్ ఆర్డరిచ్చాడు. సోఫాలో కూర్చుని కొసరికొసరి తిన్నారు.

"నీ ఉద్దేశం నా కర్థం కావడం లేదు" శ్వేత అంది "నన్నేమనుకుంటున్నావు? ఇలా నీవెంబడి అన్నిచోట్లకు తిరుగుతూవుంటే చూసేవాళ్ళు ఏమనుకుంటారు?"

"మొగుడు పెళ్ళాలని!" కొంటెగా చెప్పాడు.

"మరింకేం- ఆ మూడు ముళ్ళు ఏవో నా మెళ్ళో వేసెయ్యరాదా? ఈ చాటుమాటు వ్యవహారం తప్పుతుంది...." శ్వేత కోపంగా అంది.

సుధాకర్ షాక్ తిన్నాడు. శ్వేత అంత కాజువల్‌గా డిమాండ్ చేయగలదని అతడు అనుకోలేదు.

"ఏంది ఆలోచిస్తున్నావు?"

"ఇంకా టైం పడుతుంది. ఇంకో సంవత్సరం అయితే ఆ పి.జి పూర్తవుతుంది. వెంటనే ఉద్యోగం వెతుక్కుని మా వాళ్ళని ఒప్పించి" చెప్పాడు.

"ఆ! ఈలోగా మేను ముసలి దాన్నై పోతా! మా వాళ్ళు నాకు ఇంకో పెళ్ళి చేస్తారు!" కన్నీటితో చెప్పింది.

అతను మగాడే కాబట్టి కరిగిపోయాడు.

"మీది లవ్ మ్యారేజా!" ఆలోచిస్తున్న సుధాకర్‌ని అడిగాడు శ్రీపతి.

"అవును సార్! ప్రేమ వివాహం! పెద్దలు అంగీకరించకపోతే గుళ్ళో పెళ్ళి చేసుకున్నాం" చెప్పాడు సుధాకర్...

"దాని మొహం! అది వగలాడి...ప్రేమా గీమా" ఛీత్కరించింది. శ్రీపతి చెప్పినదాన్ని విని చందన.

"సుధాకర్ కంత ధైర్యం లేదే!" ఆశ్చర్య పోయాడు శ్రీపతి.

"ఆ! ఇది ఉందిగా ధైర్యం ఇవ్వడానికి. అసలు శ్వేత నాతో ఏం చెప్పేదంటే-నా ప్రియుడు వాజమ్మ! అందుకనే కడుపు వచ్చినట్లు నాటకం ఆడాను. ఇంకెక్కడికి పోతాడు పెళ్ళి చేసుకోక. చేసుకుంటావా...చావమంటావా... అని బెదిరించింది. అతని మీద పోలీసులకి రాసిన కంప్లైట్ లెటర్ కూడా నాకు చూపింది" "నిజం!".

"ఆ! అది తెగించిందండి... పైసా కట్నం లేకుండా మొగుడ్నికొట్టెయ్యాలనుకుంది కొట్టేసింది". చందన చెప్పింది.

ఆ మరునాడు అడిగాడు శ్రీపతి. "సుధాకర్! నువ్వు చదువు పూర్తి చేసుకుని పెళ్ళి చేసుకుంటే బాగుండేదేమో! పెద్ద ఆఫీసరయిపోయేవాడివి. పైగా చాలా తెలివిగలవాడివి. "

శ్రీపతి మెచ్చుకోలుగా అన్నాడు.

"నాకు అలాగే ఆలోచన ఉండేది... కానీ మన చేతిలో ఏముంది సార్! అంతా లలాటలిఖితం!" బాధగా అన్నాడు సుధాకర్.

"ప్చ్! నీ తెలివి తేటలకు ఇంత కంటే మంచి జీవితం దొరికి ఉండేది!" సానుభూతి చూపించాడు. సుధాకర్‌కు పెళ్ళి గుర్తుకొచ్చింది.

ఆ రాత్రి ఇద్దరూ బస్సెక్కి శ్రీశైలం పారిపోయారు. తెల్లారిన తర్వాత మల్లన్న సన్నిధిలో దండలు మార్చుకున్నారు. పురోహితులు వేద మంత్రాలు చదివారు. తను తెచ్చిన డబ్బుతో నిరాడంబరంగా పెళ్ళి జరిగిపోయింది.

శోభనం కూడ అక్కడి సత్రంలో జరుపుకున్నారు.

"ఏవండీ! మీరు దేవుళ్ళండి!" శ్వేత అతని పాదాల మీద వాలిపోయింది ఏడుస్తూ!

"ఛ! కాళ్ళమీద పడడమేమిటి ఈ కాలంలో!" లాలనగా పైకి లేవనెత్తాడు.

"లేదండి... మీ జీవితంలో నాకింత స్థానం ఇస్తే మీ పాదాలకు సేవ చేసుకుంటూ బ్రతుకుతాను" శ్వేత చెప్పింది.

"నో నో! నీ స్థానం నా గుండెల్లో... కాకపోతే ఇంత హఠాత్తుగా అందరినీ వదిలేసి దొంగతనంగా పెళ్ళి చేసుకోవలసి వచ్చింది...అదే...అదే బాధగా వుంది!" చెప్పాడు.

"ఆ లేడి డాక్టర్ నాకా విషయం చెప్పకపోతే...నాకు మటుకు తొందరేముంది! ఇంకా మా ఇద్దరక్కల పెళ్ళి కాలేదు. పెళ్ళి కాకుండానే కాలు జారానని తెలిస్తే వాళ్ళకి పెళ్ళి కాదండి" బాధగా అంది.

"ఆ రోజు మనం జాగ్రత్తగా ఉంటే బాగుండేది ఆవేశాలకు లొంగి పోయి...మన భవిష్యత్తును పణంగా పెట్టుకున్నాం."

"మీరేం బాధపడకండి...నేను ఇంకో డాక్టర్‌కు చూపించుకుని...అది లేకుండా చేస్తాను. మన ఆనందానికి మూడోజీవి అడ్డు రాకూడదు". శ్వేత కళ్ళు తుడుచుకుంటూ అంది.

కాని...అటు వాళ్ళు...ఇటు వాళ్ళు...ఇద్దరినీ వెలేశారు. శ్వేతకైతే పెద్ద బాధ లేదు. ఎలాగూ అత్తారింటికి రావాల్సిందే, కాకపోతే సుధాకర్ మటుకు తన ఆస్తిపాస్తులు వదులుకోవాల్సి వచ్చింది. అలాగే చదువు, భవిష్యత్ కోల్పోయాడు.

వివాహం విద్య నాశాయ...శోభనం సర్వ నాశాయా...అన్నట్లు సగటు మనిషిలా మునగానాం తేలానాం అయింది అతని పరిస్థితి.

"సార్! మా శ్వేత నా కంటే తెలివిగలది. నాకు మంచి జాబ్ వచ్చేదో...కాదో...తను ప్రయత్నించి ఉంటే, ఖచ్చితంగా మంచి ఆఫీసర్ అయ్యేది!" సుధాకర్ చెప్పాడు.

"మరి కాలేదేం?" ఆశ్చర్యపోయాడు.

"ఆమె కుటుంబం బాగా దెబ్బతింది. ఈమె తొందరపాటుకు ఆమె అక్కలకు పెళ్ళిళ్ళు కాలేదుట, వాళ్ళ నాన్న జబ్బు పడ్డాడుట! అమెకు షాకయింది. ఏడాది తిరిగేసరికి బాబు...ఇంకో ఏడాదికి పాప...ఊపిరి తిరగలేదు" సుధాకర్ బాధగా చెప్పాడు.

"తొందరపడి ఒక కోయిలా ముందే కూసింది..." శ్రీపతి చిన్నగా హమ్ చేశాడు. "తనకు పెళ్ళి కావడమే ముఖ్యం అనుకుంది ఆమె."

"అవున్సార్! కొంచెం నిదానంగా ఆవేశం తగ్గించుకుని ఆలోచించుకుని ఉంటే...మా అందరి జీవితాలు ఇంకా మెరుగ్గా ఉండేవి! ప్చ్!" నిట్టూర్చాడు సుదాకర్.

ఒక రోజు ఆఫీసులో అరుపులు వినిపిస్తే ఛేంబర్‌లోంచి బయటకు వచ్చాడు శ్రీపతి. సుధాకర్ ఎవరితోనో గొడవ పడుతున్నాడు.

"ఇది ఆఫీసు-బిచ్చగాళ్ళ సత్రంకాదు-అడుక్కోదలచిన వాళ్ళు-కిందగేటు దగ్గరే ఉండాలి. ఆఫీసు అయిన తర్వాత అడిగితే తోచినంత యిస్తారు పుణ్యాత్ములు". ఎదురుగా ఉన్న ఓ బీద బ్రాహ్మడి మీద అరుస్తున్నాడు.

"బాబూ! బీద బ్రాహ్మడిని! పుణ్యం వస్తుంది. ఎందుకలా గొంతు చించుకుంటావు. మీ ఆఫీసర్ దగ్గరే పర్మిషన్ తీసుకుంటా...లోపలికి పోని". దీనంగా వేడుకుంటున్నాడు ముసిలాయన.

"వీల్లేదు...సింహచలం ఇతన్ని బయటకు నెట్టు" సుధాకర్ ఆవేశపడుతున్నాడు-ఆ దారిద్ర నారయణుడి మీద.

"సింహాచలం...ఆయన్ని నా ఛేంబర్‌లోకి పంపించు." శ్రీపతి గట్టిగా అరిచాడు.

ఆయన్ను చూసి సుధాకర్ తన సీట్లో కూర్చున్నాడు.

"ఏంటి గొడవ?" కాసేపటికి తన ముందున్న ముసలాడిని చీదరించుకుంటూ అడిగాడు శ్రీపతి.

"బాబు! నేను బ్రతికి చెడ్డవాడ్ని! నేనూ ఉద్యోగం చేసి రిటైర్డ్ అయినవాడినే! నాకూ మంచి చెడ్డలు తెల్సు!" లో గొంతుకతో అన్నాడు. మూర్తిభవించిన పేదరికం అతనిలో తాండవిస్తోంది. "అయిదు సంవత్సరాల క్రితం నన్ను చూసిన, వాళ్ళెవరూ నన్నిపుడు గుర్తుపట్టలేరు-పోల్చుకోలేరు"

"మరి ఏంటి ఈ పని! ఆఫీసు అవర్స్‌లో స్టాఫ్‌ను డిస్టర్బ్ చేయకూడదని తెలీదా?" కోపంగా అడిగాడు శ్రీపతి.

"తెల్సు! నాతో వాదించే కంటే తలా 5 రూపాయలు ఇచ్చినా ఇంకా ముందే వెళ్ళిపోయేవాడిని". మొండిగా అన్నాడు.

"ఎందుకివ్వాలి?" కోపంగా అడిగాడు.

"నేను ఊరికే అడగడం లేదు. ఓ ఆడపిల్ల తండ్రిగా ఓ పిల్లకు పెళ్ళి చేద్దామని అడుగుతున్నా!" దీనంగా అన్నాడు.

"ఆ ఇటువంటి వాళ్ళను చాలామందిని చూశాం! ఏదో కారణం చెప్పేది. అడుక్కునేది. వచ్చిన డబ్బుతో తాగి తందనాలాడేది". శ్రీపతి మాటలు పూర్తి కాకముందే టప్‌మని శబ్దం అయింది టేబుల్ మీద.

ముసలాడు ఏడుస్తున్నాడు. శ్రీపతికి జాలి కలిగింది. అతను భుజానికి వేలాడుతున్న సంచిలోంచి ఓ. శుభలేఖ తీసిచ్చాడు.

ఫలానా సీతకు...ఫలానా రామయ్యకు పెండ్లి...ఇట్లు తమ ఆగమనాభిలాషులు... జానకీరామయ్య, కర్నూలు.

"ఆయాం సారీ! నిజంగానే మీ అమ్మాయికి పెళ్ళి జరుగుతున్నట్టుంది. నా చందా ఓ వంద యిస్తాను. మా మిసెస్ కర్నూలు అమ్మాయే! అన్నట్లు మీతో తగూ పడ్డ అతడి భార్యది కర్నూలే!"

"అట్లానా బాబూ...తమరు చల్లగా ఉండాలి...తమరి పేరు?"

"నా పేరు శ్రీపతి...నా భార్య పేరు చందన...అతడి భార్య పేరు శ్వేత."

"హా! శ్వేతా!" అతను టేబులు మీదకు ఒరిగిపోయాడు, శ్రీపతి కంగారుపడి మొహంమీద నీళ్ళు జల్లాడు. అతనిలో కొంచెం చలనం!

"ఏంటి అలా అయిపోయారు. మీకేమైన జబ్బు ఉందా?"

"శ్వేతా! ఆ పాపి మూలంగానేబాబూ ఈ సీత పెళ్ళి ఇన్ని సంవత్సరాలు ఆలస్యం అయింది. అది కూడ మంచి సంబంధం తేలేక పోతున్నాను. ఎలాగో దీనికి చేస్తే రేఖకి కూడా చెయ్యాలి."

"అరే! శ్వేత మీకేమవుతుంది" కుతూహలంగా అడిగాడు.

"ఒకప్పుడు ఆమె నా మూడో కూతురు. మా ఆశలన్ని ఆమె పైనే ఉండేవి. కొడుకులు లేకపోయినా, తమ మంచి ఉద్యోగస్తురాలై, మమ్మల్ని పోషిస్తుంది అని ఆశపడ్డాం. కాని అది తలవంపులు తెచ్చే పనిచేసి కులం కాని వాడితో లేచిపోయింది" కన్నీళ్ళు కారుతున్నాయి.

"అరెరే! నాకు తెలీదే! అలా చేసిందా?"

"ఆ! అదే! అలా చేసింది. తను కాలు జారింది-కుటుంబాన్ని రచ్చకీడ్చింది. కుదిరిన సంబంధం కాన్సిల్ అయింది". బాధగా చెప్పాడు. "దానివలన చాలా డబ్బు నష్టపోయాం. "

"కానీ...తను పెళ్ళి చేసుకుని మీకు భారం కాకుండా చేసుకుంది శ్వేత. లేకపోతే ఇంకా రెండు పెళ్ళిళ్ళు చేయవలసివచ్చేది."

"ఆ! ఈ తండ్రి తనకు పెళ్ళి చెయ్యడనుకుందో ఏమో...తన స్వార్ధం తాను చూసుకుంది. బహుశ అది సుఖపడిందేమో తెలియదు. కాని దాని తొందరపాటుకు కుటుంబం మొత్తం ముఖ్యంగాదాని అక్కలు శిక్షలు అనుభవించారు!" కండువాతో ముఖం తుడుచుకుంటూ అన్నాడు ముసలాయన.

(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 19-6-1998)

